www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 22 జూన్ 2024
5
అన్నమయ్య



వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డిఇఒ

ప్రజాశక్తి-రాయచోటి : యోగాతో శారీరక, మానసిక వికాసం సాకారం అవుతుందని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి అన్నారు. సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు తృతీయ సోపాన్ సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు విజయలక్ష్మి, పాఠ శాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, యోగా జిల్లా నోడల్ అధికారి జనార్ధన్, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ట్రెజరర్ మార్ల ఓబుల్‌రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ దిలీప్ కుమార్, స్కౌట్స్ అండ్ గైడ్స్ అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, ట్రైనర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

అంతర్మథనమే



సార్వత్రిక ఎన్నికల ఓటమి వైసిపిని ఆత్మరక్షణలో పడేసింది. 2009లో పార్టీ ఆవిర్భావం నుంచి ఉమ్మడి కడప జిల్లాల్లో వైసిపికి తిరుగులేని సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి కంచుకోట బద్దలు కావడంపై సీరియస్ సమీక్షకు ఆవశ్యకత ఏర్పడింది. ఎక్కడ పొరపాటు దొర్లిందనే అంశంపై లోతైన వరుస సమీక్షలతో భవిష్యత్ కార్యకలాపాల రూపకల్పన చేసుకోవాలి. వైఎస్ జగన్ నివాసమైన తాడేపల్లి, తాజాగా అసెంబ్లీ ఛాంబర్ వేదికగా చర్చోపచర్చలు చేసిన సంగతి తెలిసిందే. ఎన్నికల్లో ఓటమి పాలైన అనంతరం తొలిసారి పులివెందులకు వస్తున్న నేపథ్యంలో ఘోర పరాజయానికి గల కారణాలను, క్షేత్ర స్థాయి పరిశీలనలతో సరిపోల్చి చూసుకోవాలి.

నేడు పులివెందులకు జగన్ క్షేత్రస్థాయి సమీక్షకు అవకాశం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైసిపి కేడర్‌లో నైరాశ్యం నెలకొంది. వైసిపి శ్రేణుల్లో నెలకొన్న నిరుత్సాహాన్ని తొలగించి, దిశానిర్దేశం చేయాలి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కడప, అన్నమయ్య జిల్లాలో వైసిపి ఉనికి పాతాళానికి పడి పోయింది. ఉమ్మడి కడప జిల్లాలో కడప, రాజంపేట పార్లమెంటు స్థానాలు సహా 13 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. కడప జిల్లాలో పులివెందుల, బద్వేల్, అన్నమయ్య జిల్లాలో రాజంపేట, తంబళ్లపల్లి స్థానాలకు పరిమితం కావడాన్ని సీరియస్‌గా సమీక్షించాల్సి ఉంది. ఓటమికి గల కారణాలను అధ్యయనం చేయాలి. వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీ పరిస్థితి రాష్ట్ర మంతటా ఒకెత్తు అయితే వైఎస్ జగన్ సొంత జిల్లాలో పార్టీ పరిస్థితి ఒకెత్తు. ఇటువంటి ప్రత్యేకతల నేపథ్యంలో ముందుగా ఇంటిని(జిల్లాను) చక్కదిద్దుకునే ప్రయత్నం చేయడం అత్యవసరం. దీంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఘోర పరాజయానికి గల కారణాలను అన్వేషించాలి. విజయవాడలోని వైఎస్ జగన్ నివాసమైన తాడేపల్లిలో ఓటమి పాలైన వైసిపి అభ్యర్థులు, గెలుపొందిన ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించడం, ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం సందర్భంగా అసెంబ్లీ ఛాంబర్‌లో గెలిచిన 11 మంది ఎమ్మెల్యేలతో సమావేశం కావడం తెలిసిందే. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలైన తర్వాత శనివారం సొంతగడ్డ పులివెందులకు రానున్నారు. సుమారు ఐదు రోజులు ఉండే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇటువంటి విరామం నేపథ్యంలో తన పాలనలో సంక్షేమం, అభివృద్ధి, పార్టీని విస్మరించడం, కేడర్ కబ్జాల సరళి, సాంకేతికత అంశాలపై దొర్లిన తప్పిదాలపై క్షేత్రస్థాయి నుంచి సమాచారాన్ని సేకరించుకునే ప్రయత్నం చేయాలి. ఫలితంగా ప్రతి పక్ష హోదా కూడా దక్కని విధంగా ఘోర పరాజయం పలకరించడంపై లోతుగా సమీక్షించుకోవాలి. తన పాలనలో దొర్లిన తప్పిదాలను సమీక్షించుకోవాలి. టిడిపి హామీల అమలును పరిశీలించిన అనంతరం భవిష్యత్ కార్యాచరణను అమలు చేయాలి. ప్రజల పక్షాన నిలిచి, ప్రజాసమస్యలపై సమరశంఖం పూరించాలి. పులివెందులలో ఐదు రోజులు ఉండనున్న నేపథ్యంలో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులైన సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ఎంపిపిలు, జడ్‌పిటిసిల నుంచి ఎమ్మెల్యే, ఎంపీ స్థాయి ప్రజాప్రతినిధులను దగ్గరగా కలిసి, తన పాలనలో దొర్లిన తప్పిదాలపై క్షేత్రస్థాయి ఫీడ్‌బ్యాక్ తీసుకుని, విధానాలను సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణకు రూపకల్పన చేసుకోవాలి.

ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

2024, మే 13న నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన అన్నమయ్య జిల్లా ఎమ్మెల్యేలు శుక్రవారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ఎన్నికల్లో టిడిపి ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. రాయచోటి ఎమ్మెల్యేగా రవాణా, యువజన, క్రీడల శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో పాటు రాజంపేట, మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, రైల్వేకోడూరు ఎమ్మెల్యేలుగా ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, షాజహాన్‌బాషా, పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, అరవ శ్రీధర్‌లతో ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రమాణ స్వీకారం చేయించారు.



మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



షాజహాన్‌బాషా



అరవ శ్రీధర్



నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి



ద్వారకనాథరెడ్డి



ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ఆంధ్రప్రదేశ్‌లో స్వచ్ఛమైన ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడటానికి ఎన్‌డిఎ కూటమి ఏర్పాటు చేయుటకు ప్రధాన పాత్ర పోషించిన జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్‌కు ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఒక విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు ఒక్కడే అని ప్రజలు గమనించారన్నారు. ప్రపంచంలోనే తెలుగు వారందరికీ ఆశలు చిగురించాయని తెలిపారు. దేశ సమగ్రత సమైక్యతను కాపాడాలంటే కూటమి ఒక్కటేనన్నారు. మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన శుభసందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షేమ శాఖలు సమర్థవంతంగా పనిచేయాలి

- కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని సంక్షేమ శాఖలు సమర్ధవంతంగా పనిచేయాలి ఆయా సంక్షేమ శాఖల ద్వారా ప్రజల అవసరాలను గుర్తించి అడుగులు వేస్తే సంక్షేమం సార్థకమవుతుందని కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, వికలాంగ, మహిళ శిశు సంక్షేమం, సంక్షేమ శాఖల కార్పొరేషన్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, వికలాంగ సంక్షేమ శాఖలలో ఏమేమి కార్యక్రమాలు అమలు చేస్తున్నారు, అందులో భౌతిక, ఆర్థిక లక్ష్యం, సాధించిన ప్రగతి, జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు ఎన్ని, వాటిలో గల విద్యార్థుల సంఖ్య, హాస్టల్లోని సౌకర్యాలు, మెనూ, స్కాలర్‌షిప్స్, స్టడీ సర్కిల్స్, కమ్యూనిటీ హాల్స్ అంశాలు, మహిళా శిశు సంక్షేమ శాఖలో జిల్లాలో ఎన్ని ప్రాజెక్టులు, క్లస్టర్లు ఉన్నాయి, ఏయే పథకాలు అమలు చేస్తున్నారు, మహిళలు, పిల్లలకు అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలు, వన్ స్టాప్ సెంటర్, దిశా, చైల్డ్ ప్రొటెక్షన్, ఆర్ఫన్ హోమ్స్, వికలాంగ శాఖ ద్వారా అమలుపరుస్తున్న పథకాలు, కార్పొరేషన్ల ద్వారా అమలు చేస్తున్న పథకాలు తదితరాలలో ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, వికలాంగ, మహిళా శిశు సంక్షేమం శాఖల పరిధిలో ఎవరైతే ఉన్నారో వారికి సంబంధించిన అవసరాలు, ఎలాంటి సదుపాయాలు అవసరమో జిల్లా అధికారులకు తప్పనిసరిగా తెలిసి ఉండాలిన్నారు. పిల్లలు కానీ మహిళలు కానీ సంక్షేమ శాఖల లక్షిత వర్గాల అవసరాలను గుర్తించాలిన్నారు. ఏవైతే ప్రభుత్వ పథకాలు ఉన్నాయో వాటిని మరింత మెరుగ్గా పారదర్శకంగా ప్రజలకు అందజేయాలిన్నారు. సహజంగా ప్రజల జీవితాన్ని మెరుగుపరచడానికే మనమందరం ప్రయత్నిస్తున్నామన్నారు. వారి అవసరాలు గుర్తించి ఆ దిశగా సమర్ధవంతంగా అడుగులు వేస్తే సంక్షేమం సార్థకం అవుతుందిన్నారు. ఎవరెవరికి ఎలాంటి అవసరాలు ఉన్నాయో గుర్తించడానికి వివిధ మార్గాలలో మూలాలను గుర్తించాలిన్నారు. జిల్లాలో ఎక్కడ ఏం జరుగుతోంది, ఎక్కడ వలసలు ఎక్కువగా ఉన్నాయి, మహిళల సమస్యలు ఏమిటి, రాయచోటి, రాజంపేట మదనపల్లి డివిజన్ ప్రాంతాలలో ఎలాంటి సమస్యలు ఉన్నాయి, ఏ ప్రాంతంలో స్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలు ఎక్కడ ఎక్కువగా ఉన్నాయి, ఎక్కడ ఏ ప్రాంతంలో ఎక్కువ పని చేస్తున్నవారు ఉంటారు, ఆ ప్రాంతంలో వారి అవసరాలు ఏమిటి సమస్య ఏంటి అన్నవి గుర్తించాలన్నారు. ఉదాహరణకు ఎక్కడైనా ఒకచోట కమ్యూనిటీ హాల్ అవసరం ఉంటే నిబంధనల మేరకు ప్రభుత్వ పరంగా చేయలేకపోతే సామాజిక బాధ్యత కింద చేయవచ్చు ఇందుకు ముందుగా అవసరాలను గుర్తిస్తే వాటికి తగినట్టుగా ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు ఏమేం ఉన్నాయి, ఏ విధంగా వీటిని సమన్వయం చేసి ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అందించవచ్చునని ఆలోచన చేయాలన్నారు. మూస ధోరణిలో కాకుండా ఆచరణాత్మక దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలలో ఎవరైనా జీవనోపాధి గురించి చూస్తుంటే ప్రభుత్వమే అని కాకుండా దాతలు లేదా ఇతరత్రా కూడా ముందుకు వచ్చిన వారిని సమన్వయం చేసుకొని ఒక యూనిట్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించినప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయినీ అలాగే ఎక్కడైనా హాస్టల్లో కనీస సౌకర్యాలు లేనప్పుడు అందుబాటులో ఉన్న నిధులను ఉపయోగించి చేయాలిన్నారు. లేదా స్థానికంగా ఎవరైనా దాతలను ప్రోత్సహించి వసతులు కల్పించవచ్చున్నారు. ఇక్కడ ప్రభుత్వం చేసిందా ప్రభుత్వేతర సంస్థలు, వ్యక్తులు చేశారా అన్నదానికంటే ప్రజలకు అవసరమైన వాటిని చేయగలిగామా లేదా అన్నది ముఖ్యం చెయ్యడానికి ఏం లేదు కదా ఎందుకు తెలుసుకోవాలని అభిప్రాయం ఉండరాదని మూస ధోరణి ఆలోచనలను మార్చుకొని అవసరమైన వారికి సహాయం అందించగలిగేలా చర్యలు ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "బేటి బచావో - బేటి పడావో" ప్రచార పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో స్‌సి, ఎస్‌టి సంక్షేమ శాఖల ఇన్‌ఛార్జి అధికారి వెంకటసుబ్బయ్య, బిసి, మైనార్టీ సంక్షేమ అధికారులు సందప్ప, మస్తాన్, ఐసిడిఎస్ అధికారిని శశికళ, సిపిఓ కృష్ణానాయక్, ఇండస్ట్రీస్ జిఎం సూరిబాబు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి 17 నెలల బకాయి జీతాలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామానుజులు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రకృతి వ్యవసాయ అన్నమయ్య జిల్లా ఉద్యోగులు సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద పెండింగ్ వేతనాల కోసం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు మాట్లాడుతూ గౌరవేతనం లేక కుటుంబ పోషణ, పిల్లల చదువులు, ఆరోగ్యం, కుటుంబ అవసరాలకు చాలా ఇబ్బందులు పడుతున్నదుష్ట్య, జిల్లా అధికారులు మరియు రాష్ట్ర అధికారుల దృష్టికి పలు రకాలుగా మా సమస్యలు విన్నవించినప్పటికి గౌరవ వేతనాలు తాము వేయబోతున్నామని అధైర్య పడవద్దు అని పదేపదే హామీ ఇస్తూ కాలయాపన చేస్తూ 17 నెలల గౌరవ వేతనాలు ఎపిసిఎన్ఎఫ్ ప్రాజెక్టు వారు మాకు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మధుకర్, సిద్దయ్య, కోశాధికారి సుబ్రహ్మణ్యంచారి మాట్లాడుతూ ఇప్పటికైన 17 నెలల బకాయి గౌరవేతనాలు ఇవ్వాలని అందరి నిర్ణయించిన వేతనాల ప్రకారం ఈనెల ఆఖరికి ప్రభుత్వ ఆదేశాల మేరకు అందిస్తున్న గౌరవ వేతనాలు పూర్తిస్థాయిలో అందించి ఆదుకోవాలని కోరారు. సంస్థ నుండి రావలసిన కనీస సౌకర్యాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రవీంద్ర, ఖాదర్ బి.నాగరాజు, సుధ, జిల్లా వ్యాప్తంగా నుండి పెద్ద ఎత్తున ప్రకృతి ఉద్యోగులు పాల్గొన్నారు.

డయేరియా నివారణకు చర్యలు చేపట్టాలి : కలెక్టర్



విసిలో పాల్గొన్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో విస్తృతంగా స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లు నిర్వహించి డయేరియా నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులకు సూచించారు. శుక్రవారం వెలగపూడి, సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి అతిసార కేసుల వ్యాప్తి (స్టాప్ డయేరియా క్యాంపెయిన్), తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్‌లతో విసి ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు. విసి అనంతరం కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లు విస్తృతంగా చేపట్టాలన్నారు. జిల్లాలో ఎక్కడా అతిసార కేసులు వ్యాప్తి చెందకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఇందు కోసం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఒక ప్లాన్ ప్రకారం ముందుకు వెళ్లాలన్నారు. జిల్లాలో అతిసార కేసుల వ్యాప్తి అరికట్టేందుకు కమ్యూనికేషన్ స్ట్రాటజీ, మానిటరింగ్ మెకానిజం అమలు చేయాలన్నారు.గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేయాలని, ఆశా వర్కర్‌ల ద్వారా తక్కువ బరువున్న చిన్నారులకు జింక్ ప్యాకెట్లను అందించాలన్నారు. ఆరోగ్య శాఖ సహకారంతో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు అంగన్‌వాడీలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ కార్నర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. చిన్నారుల్లో గ్రోత్ మానిటరింగ్ నిర్వహించడంపై అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ఇవ్వడం, తక్కువ బరువున్న పిల్లలకు పోషకాహారం అందించడం చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడా కూడా డయేరియా, అతిసార కేసులు వ్యాప్తి చెందకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో 'సాయి' విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-రాయచోటి

శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాల రెండవ సంవత్సరం ఇంజినీరింగ్ రెండవ సెమిస్టర్ విద్యార్థులు యూనివర్సిటీ విడుదల చేసిన ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచి అత్యుత్తమ ఫలితాలు సాధించారని విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసిఇలో ఎస్.హుమేర 87.2 శాతంతో మొదటి ర్యాంకు ఎస్.సాబీహ 85.2 శాతంతో రెండవ ర్యాంకు, ఎం.విపవిత్ర 85 శాతంతో మూడవ ర్యాంకు, సిఎస్‌సిలో నుంచి ఎం.ఎస్.సనా సాజియా 92.29 శాతంతో మొదటి ర్యాంకు ఎస్.రీమా 90.04 శాతంతో రెండవ ర్యాంకు ఎస్.ఆయేషా సనా 87.29 శాతంతో మూడవ ర్యాంకు సాధించి యూనివర్సిటీ స్థాయిలో అగ్రగామిగా నిలిచారని పేర్కొన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను, ఫలితాల సాధనలో భాగమైన అధ్యాపకులను అభినందిస్తూ, ప్రతి ఒక్కరికి ఉద్యోగ ఉపాధి భరోసా కల్పించడానికి మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని అంకితభావంతో కృషి చేయాలని, క్రమశిక్షణతో ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి శుభహాన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ కార్తికేయన్, అధ్యాపకులు అభినందించారు.

కమనీయం కరుణశ్రీ కవిత్వం

- ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

కరుణశ్రీగా ప్రసిద్ధులైన జంధ్యాల పాపయ్య శాస్త్రి కవిత్వం ప్రత్యేక శైలిని కలిగి, ఆలోచనాత్మకంగా ఉండి పాఠకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తుందని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్బులో శుక్రవారం జంధ్యాల పాపయ్య శాస్త్రి 32వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ కరుణ శ్రీ రాసిన ఉదయశ్రీ. కరుణ శ్రీ, విజయ శ్రీ, లలిత సుగుణ జాల తెలుగు బాల,ప్రేమ మూర్తి,స్వప్న వాసదత్తం, భాగవత వైజయంతిక గ్రంథాలు తెలుగు సాహిత్య లోకంలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నాయన్నారు. కవి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి కరుణ శ్రీ కవిత్వం సంప్రదాయ, ఆధునిక, ఆధ్యాత్మిక అంశాలతో కలిసి ఉంటుందని, కరుణ శ్రీ లాంటి మహోన్నత కవి మనకు లభించడం ఆంధ్రుల అదృష్టమే అన్నారు. విశ్రాంత తెలుగు అధ్యాపకులు జీవకల సత్యనారాయణ మాట్లాడుతూ జంధ్యాల పాపయ్య శాస్త్రి నవరసాల్లో కరుణ రసాన్ని తన కావ్యాల్లో అత్యద్భుతంగా ఉపయోగించుకున్నారని తెలిపారు. అయన రాసిన ఎక్కువ కావ్యాలు కరుణ రసాత్మకంగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంకు గంగయ్య, గండి రామసుబ్బయ్య, రవీంద్రనాథ్ రెడ్డి, గంగయ్య యాదవ్, వెంకటరమణ, గడికోట రెడ్డయ్య,మాదిరెడ్డి వెంకటరమణ,బాల ఓబయ్య,జ్యోతి జార్జ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

బాధ్యులను వెంటనే అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న నేత కార్మికుడు రమేష్ బాబు మృతికి కారుకులైన వారిని వెంటనే అరెస్టు చేసి న్యాయస్థానంలో శిక్ష పడేలా చూడాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోపు కృష్ణప్ప, ఎం.సాంబశివ డిమాండ్ చేశారు. శుక్రవారం తాలూకా పోలీసు స్టేషన్ సిఐ సద్గురుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత కార్మికుడు రమేష్ బాబు కొనుగోలు చేసిన స్థలాన్ని తనకు ఇవ్వకుండా మోసం చేశారన్న కారణంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. పట్టణ పరిసర ప్రాంతాల్లో కొంత మంది రియల్ వ్యాపారులు చేస్తున్న మోసాలు కారణంగా అమాయక ప్రజలు ప్రాణాలు తీసుకుంటున్నారని, అలాంటి మోసాలకు పాల్పడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. అప్పులబాధ భరించలేక కొనుగోలు చేసిన స్థలం కూడా మోసపూరితం కావడంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన రమేష్ బాబు కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కొనుగోలు చేసిన స్థలాన్ని రమేష్ బాబు కుటుంబానికి ఇప్పించడంతో పాటు పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి మృతికి కారుకులైన వారిని అరెస్టు చేసి న్యాయస్థానంలో శిక్ష పడేలా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి పట్టణ కార్యదర్శి తిరుమల, సిపిఐ నాయకులు చంద్రశేఖర్, మురళి పాల్గొన్నారు.

మదనపల్లెను జిల్లాగా ప్రకటించాలి

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్




పవన్‌కు పుష్పగుచ్చం ఇస్తున్న మహేష్

ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను శుక్రవారం జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్ క్యాంప్ ఆఫీస్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మదనపల్లె జిల్లా సాధన, బెంగళూరు టూ కడప వయా మదనపల్లె రైల్వే లైన్ సాంక్షన్ గురించి పవన్ కళ్యాణ్ ను అభ్యర్థించారు. స్పందించిన పవన్ కళ్యాణ్ టిడిపి, జనసేన ఇచ్చిన మాట ప్రకారం త్వరలోనే మదనపల్లె జిల్లా సాకారం అవుతుందన్నారు. కడప టు బెంగళూరు రైల్వే లైన్ వయా మదనపల్లె మీదుగా ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. హార్సిలీహిల్స్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలోనే జనసేన పార్టీ జిల్లా వ్యాప్త సమీక్ష సమావేశం నిర్వహిస్తానని తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పవన్‌కల్యాణ్ ఆదేశించారు. త్వరలోనే చిత్తూరు జిల్లా పర్యటనకు విచ్చేయవలసిందిగా పవన్ కల్యాణ్‌ను మైఫోర్స్ మహేష్ ఆహ్వానించారు.

తపస్య పాఠశాల ఎన్‌ఒసి రద్దుకు వినతి

ప్రజాశక్తి-పీలేరు

సిబిఎస్ఇ పేరుతో విద్యా శాఖ నిబంధనలను అతిక్రమించి అడ్మిషన్లు చేసుకున్న పీలేరులోని తపస్య యూపీ స్కూల్‌కు ఇచ్చిన ఎన్‌ఒసిని రద్దు చేయాలని, నిబంధనలను అతిక్రమించిన తపస్య యుపి స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమృత్ తేజ, జనసేన విద్యార్థి విభాగం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు బాటసారి ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతి జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయంలో వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తపస్య పాఠశాలకు కేవలం ఒకటి నుంచి ఏడో తరగతి వరకు మాత్రమే విద్యాశాఖ అనుమతులు ఉన్నాయని, కానీ తపస్య పాఠశాల నిర్వాహకులు గౌతం హైస్కూల్ గుర్తింపుతో 10వ తరగతి వరకు అడ్మిషన్లు చేస్తూ తల్లిదండ్రులకు విద్యార్థులకు తపస్య హై స్కూల్ కి అడ్మిషన్లు చేస్తున్నట్టుగా మోసం చేస్తున్నారు తపస్య సి బి ఎస్ సి ఎన్ఓసిని రద్దుచేసి నిబంధనలు అతిక్రమించిన తపస్య యూపి స్కూల్ యొక్క గుర్తింపు కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పీలేరులోని అనేక పాఠశాలలు విద్యా సామాగ్రిని అధిక మొత్తానికి అమ్ముతున్నారని అటువంటి వాటిపై కఠిన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోహిత్, జానీ, ఇంద్ర, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



డిఇఒకు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

మోటర్ వెహికల్ చట్ట సవరణను రద్దు చేయాలి

- సిఐటియు వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్ : రవాణా రంగానికి మరణ శాసనమైన మోటార్ వెహికల్ చట్టం 2019ను రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో రవాణా కార్మికుల ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటర్ వెహికల్ సవరణ చట్టం, 2019 మన దేశంలో చిన్న, మధ్య తరహా యాజమాన్యానికి, డ్రైవర్ కం ఓనర్లుకు ఇబ్బందికరమని తెలిపారు. రోడ్డు రవాణా రంగాన్ని బడా కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలనే ఉద్దేశంతో తీసుకొచ్చారని పేర్కొన్నారు. జరిమానాలు, చలానాలు, పెనాల్టీలు అనేక రేట్లు పెంచి డ్రైవర్ల ఓనర్ల, రక్తాన్ని పిండుతున్నారని చెప్పారు. అన్ని వాహనాల థర్డ్ పార్టీ బీమా ప్రీమియం రెట్టింపు కంటే ఎక్కువగా పెంచారని తెలిపారు. సాధారణంగా ప్రీమియాలను ప్రమాదాలు, చెల్లించిన పరిహారం ఆధారంగా నిర్ణయించాలని చెప్పారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 10 ఏళ్లలో ప్రమాదాలు రెండింతలు పెరగలేదని పేర్కొన్నారు. అయినప్పటికీ కూడా ప్రీమియం రెట్టింపు అయ్యాయని తెలిపారు. ఈ విధంగా ప్రభుత్వం బీమా కంపెనీలకు మేలు చేసే పాత్ర పోషించిందని చెప్పారు. మళ్లీ టోల్ ఛార్జీలు వసూలు చేయడం ప్రజలను మోసం చేయడమే తప్ప మరొకటి కాదని పేర్కొన్నారు. నిర్దిష్ట వ్యవధి తర్వాత టోల్ల్ ఛార్జీలను రద్దు చేయాలని, కానీ ఆచరణలో మాత్రం కొనసాగిస్తున్నారని చెప్పారు. ఆశ్చర్యకరంగా ఏటా టోల్ ఛార్జీలు పెంచుతున్నారని తెలిపారు. ఇది ప్రజలను దోచుకోవడం తప్ప మరొకటి కాదని పేర్కొన్నారు. డ్రైవర్లు, కష్టమర్ల ప్రయోజనాలను కాపాడేందుకు భారత ప్రభుత్వం ఉబర్, ఓలా , రాపిడో మొదలైన వాటికి ప్రత్యామ్నాయ యాప్ను అభివృద్ధి చేయాలని చెప్పారు. ఛార్జీలు, కార్మికుల సంక్షేమం మొదలైన వాటికి సంబంధించి ఇప్పటికే ఉన్న యాప్ కంపెనీలను నియంత్రించేందుకు చట్టాన్ని రూపొందించాలని తెలిపారు. వాహన స్క్రాపింగ్ విధానం తప్పనిసరి కాకూడదని పేర్కొన్నారు. 'ఈ' చలానాలు రద్దు చేయాలని చెప్పారు. సమావేశంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సుంకర రవి, లింగప్ప, రవి, రాము, ఎల్లయ్య పాల్గొన్నారు.



గ్రూపు సభ్యులతో మాట్లాడుతున్న ఉదయకుమార్

రుణాలు సక్రమంగా చెల్లించాలి

ప్రజాశక్తి-వీరబల్లి

మహిళలు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించాలని స్త్రీ నిధి ఎజిఎం ఉదయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సానిపాయ సచివాలయంలో జరిగిన గ్రామ సమాఖ్య జనరల్ బాడీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. స్త్రీనిధి రుణాలు గత రెండేళ్లుగా బకాయిలు ఉండడం వల్ల కొత్త రుణాలు ఆపి వేశామని ఈనెల ఆఖరికి అందరూ చెల్లించాలని చెప్పారు. ఏరియా కో-ఆర్డినేటర్ కొండా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంఘాలకు బ్యాంకుల నుంచి పొందిన రుణాలకు పది లక్షల వరకు వడ్డీ రాయితీ కల్పిస్తుందని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక సర్పంచ్ నేతి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు మహిళలకే అందిస్తోందని అర్హులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎం ఖాదర్‌వలి, స్త్రీ నిధి మేనేజర్ హరీష్, సిసిలు కృష్ణయ్య, వెంకటలక్ష్మి, విఓఎ రెడ్డయ్య, సభ్యులు పాల్గొన్నారు.



సిఎం, డిప్యూటీ సిఎం, ఎమ్మెల్యే చిత్రపటాలను అందిస్తున్న విజయ్‌కుమార్‌గౌడ్

సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటాలు అందజేత

ప్రజాశక్తి- రామసముద్రం

మండలంలోని ఎలువనెల్లూరు, ఆర్.నడింపల్లి పంచాయతిలోని సచివాలయంలో శుక్రవారం మండల అధ్యక్షులు విజయ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే షాజహాన బాషా చిత్ర పటాలను పంచాయతీ కార్యదర్శి అలవేలమ్మకు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ అధ్యక్షులు చంద్రప్ప, శ్రీనివాస్ గౌడ్, జావిద్, చంద్ర, రాజేంద్ర, రమేష్, ఎల్.శివ పాల్గొన్నారు.



ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న మద్దిలేటి

'ఉపాధి' పనులు తనిఖీ

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలోని నారిగానిపల్లి పంచాయతిలో శ్రీనివాసులురెడ్డి పొలంలో జరిగిన రింగ్ ట్రెంచ్ ఉపాధి హామీ పథకం పనులను జిల్లా నీటి యాజమాన్యసంస్థ సంచాలకులు మద్దిలేటి పనులను తనిఖీ చేశారు. మాలేనత్తం పంచాయతీలో భాస్కర్‌రెడ్డి పొలంలో చేపట్టిన ఫారంపాండ్ పనులు పరిశీలించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో పథక సహాయ సంచాలకులు నంద కుమార్‌రెడ్డి, ఎపిఒ గౌరీశంకర్, జనార్దన్, నరసింహులు, రవణప్ప పాల్గొన్నారు.

సర్పంచ్ ఫిర్యాదుపై స్పందించిన అధికారులు

ప్రజాశక్తి-పీలేరు



విచారణ చేపట్టిన డిఎల్‌పిఒ నాగరాజు

పీలేరు గ్రామ పంచాయతీలో అవకతవకలు జరిగాయంటూ సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్‌బాషా, జిల్లా కలెక్టర్, డిపిఒలకు చేసిన ఫిర్యాదుపై జిల్లా అధికారులు స్పందించి డిఎల్‌పిఒ కె.నాగరాజును విచారణకు ఆదేశించారు. శుక్రవారం డిఎల్‌పిఒ పీలేరు గ్రామపంచాయతీ కార్యాలయం చేరుకుని, గత పది నెలలుగా 15 ఫైనాన్స్ కమిషన్ నిధులు, పంచాయతీ నిధులు వినియోగం పై విచారణ చేపట్టారు. పీలేరు గ్రామపంచాయతీ ఇన్‌ఛార్జి ఇఒపై సర్పంచ్ చేసిన ఆరోపణలపై కూడా డిఎల్‌పిఒ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ జిల్లా పరిపాలనాధికారి, జిల్లా పంచాయతీల అధికారి ఆదేశాల మేరకు తాను ఈ విచారణలో చేపట్టామని, విచారణ పూర్తయ్యాక నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని చెప్పారు. తుది నిర్ణయం జిల్లా ఉన్నతాధికారులకు మాత్రమే ఉంటుందని చెప్పారు.

ఆకట్టుకున్న అర్జున తపస్సు

ప్రజాశక్తి-పీలేరు

స్థానిక ఆర్‌టిసి ప్రాంగణంలో పంచమ వేద మహాభారత యజ్ఞంలో భాగంగా శుక్రవారం జరిగిన అర్జున తపస్సు కార్యక్రమం ప్రజలను ఆకట్టుకుంది. ముందుగా తపసుమానుకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అర్జున వేషధారి భక్తి పాటలను ఆలపిస్తూ ఒక్కో మెట్టు పైకి ఎక్కాడు. చివరి ఘట్టం తపస్మానుపై తపస్సు చేసి, అక్కడి నుంచి భక్తులపైకి పుష్ప, ఫలాదులను విసిరారు. కార్యక్రమంలో భాగంగా కొందరు మహిళా భక్తులు వరపడ్డారు. మహాభారత యజ్ఞం కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని ఎంపిపి స్కూల్ (మెయిన్ స్కూల్)లో పాఠశాల ఉపాధ్యాయులు రమణా రెడ్డి, కుమారుడు ఆకాష్ రెడ్డి విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రిని శుక్రవారం వితరణ చేశారు. కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి శివప్రసాద్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఎంఈఓ చేతులమీదుగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికి అవసరమైన నోటు పుస్తకాలు, పెన్సిల్లు, పెన్నులు, పలకలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బిరెడ్డి, లీలావతమ్మ, సర్వేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి 'మండిపల్లి'ని కలిసిన పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి- సింహాద్రిపురం

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మండల టిడిపి నాయకులు, మాజీ జడ్‌పిటిసి పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి కలిశారు. శుక్రవారం విజయవాడలోని సెక్రటేరియట్ కార్యాలయంలో కలిసి పలు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా పలు రాజకీయ అంశాలు, రవాణా శాఖకు సంబంధించి చర్చించినట్లు పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈయనతో పాటు లింగాల మండలం టిడిపి నాయకులు దేవిరెడ్డి సంజీవరెడ్డి ఉన్నారు.

పేరు మార్పు

షేక్ ఇమ్రాన అను నేను నా పేరు మార్చుకుంటున్నాను. భర్త షేక్ ముస్తాక్ అహమ్మద్ మా ఇంటి నెంబర్ 57/167-C భట్టు విధి, రాయచోటి మండలం అన్నమయ్య జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో నివాసం ఉంటున్నాను. నేను ఇప్పటి వరకు షేక్ ఇమ్రాన (పాత పేరు) గా వాడుకలో ఉన్న నా పేరును సయ్యద్ ఇమ్రాన (కొత్త పేరు)గా మార్చుకున్నాను. ఇకనుండి నా పేరు సయ్యద్ ఇమ్రాన గమనించగలరు.

ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు

కొనలేని స్థితిలో కూరగాయలు

ప్రజాశక్తి-గాలివీడు

నిత్యావసర ధరలు భారీగా పెరుగుతున్నాయి. సామాన్య, పేద ప్రజలు పప్పన్నం తినే పరిస్థితులు లేకుండా పోతోంది. పప్పులు, బియ్యం, ఉల్లిగడ్డలు, నూనెలు సామన్యులకు భారంగా మారుతున్నాయి. మరోవైపు కూరగాయాలు ధరలు కూడా కొనలేని స్థితికి చేరుకున్నాయి. రోజురోజుకూ నిత్యావసర ధరలు అధికంగా పెరుగుతుండటంతో కొనలేకపోతున్నామని, పచ్చడి మెతుకులు తినాలన్నా భారంగా మారిందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వం నిత్యవసర వస్తు వులు ధరలను అదుపు చేయడంలో విఫలం చెందిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పామాయిల్ రూ.120, వేరుశనగ రూ.140, పప్పులు రూ.120, చింతపండు రూ.130, కొబ్బరి రూ.30, కందిబేడలు రూ.220, ఎండు మిరప రూ.250, చక్కెర రూ.45, బెల్లం రూ.60 ఇలా రేట్లు అమాంతంగా పెరిగిపోతున్నాయని అన్నారు. మరోవైపు కూరగాయల ధరలు కూడా విపరీతంగా పెరిగాయని ఆవేదన చెందుతున్నారు. రూ.500 పెట్టుకొని బజారుకు వెళితే కనీసం ఐదు రకాల కూరగాయలు కూడా రావడం లేదని వాపోతున్నారు.



చౌకదుకాణాల ద్వారా పంపిణీ చేయాలి



కూలీ నాలీ చేసుకొని సంపాదించుకున్నదంతా నిత్యావసర ధరలకే సరి పోతోంది. ప్రభుత్వం చౌకదుకాణాల ద్వారా పంపిణీ చేయాలి. పచ్చడి మెతుకులు తినాలన్నా భారంగా మారుతోంది. పచ్చిమిర్చిని కూడా కొనలేక పోతున్నారు. పెరుగు తున్న ధరలను ప్రభు త్వం నియం త్రించాలి.

-రమాదేవి, గృహిణి, గాలివీడు

సబ్సీడితో అందివ్వాలి



పెరిగిన నిత్యావసర ధరలను కొనలేకపోతున్నాం. ప్రభుత్వమే సబ్సీడీతో పంపిణీ చేయాలి. పాలకులు మారినా, ప్రభుత్వాలు మారినా నిత్యావసర ధరలను మాత్రం అదుపు చేయలేకపోతున్నారు. ఉప్పు, పప్పు దినులు, చింత పండు, బెల్లంతో అన్ని రకాల వస్తువుల ధరలు అమాంతంగా పెరిగాయి. పెరిగిన రేట్లను నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

-కుందా లక్ష్మీదేవి, గృహిణి, గాలివీడు

ధరలను నియంత్రించాలి

నిత్యావసరాల ధరలు భగ్గుమంటున్నాయి. కొనలేక పోతున్నాము. బియ్యం, పప్పులు, చింతపండు, కొబ్బరి, నూనెల ధరలు కొనలేని స్థితికి చేరాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను నియంత్రించి సామాన్య ప్రజలకు అందుబాటులోకి తేవాలి.

-సద్దల రామసుబ్బమ్మ, గృహిణి, గాలివీడు

ప్రతి ఒక్కరికీ విద్య అందాలి : ఎంఇఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె



విద్యా సదస్సులో మాట్లాడుతున్న ఎంఇఒ నారాయణ



నేను బడికి పోతా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ చేస్తున్న అధికారులు

బడి ఈడు పిల్లలందరికీ విద్య అందాలని 'నేను బడికి పోతా' విద్యా సదస్సుపై మండల విద్యాశాఖ అధికారులు పద్మావతి, నారాయణ, తహ శీల్దార్ బాలాజీరాజు ఇతర శాఖ అధికారులతో, పాఠశాల ప్రధానో పాధ్యాయులతో కలసి క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనం తరం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నేను బడికి పోతా విద్యా సదస్సుపై పాఠశాల ప్రధానోపాధ్యాయు లకు, విఆర్‌ఒలకు, పంచాయతీ కార్యదర్శులకు, గ్రామ సచివాలయ విద్య, సంక్షేమ సహాయ కులకు అవగాహన కల్పించారు. చదువు మధ్యలో నిలిపివేసిన, అనేక కారణాలతో పాఠశాలకు వెళ్లలేక పోతున్న చిన్నారులను గుర్తించి వారిని తిరిగి బడిలో చేర్పించాలని, చదువుకోవడానికి వారిని ప్రోత్సహించాలని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం పాఠశాలకు పంపాలని సూచించారు. బాల కార్మికులను నిర్మూలించడానికి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతుందని అన్నారు. విద్యతోనే భవిష్యత్తులో మంచి చెడులు ఆలోచించే జ్ఞానం, జీవితంపై అవగాహన కలుగుతుందని అన్నారు. గ్రామాలలో బడి నిలిపివేసిన పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని, దీనిపై ప్రతిరోజూ సమీక్ష ఉంటుందని తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. మానవుని మనుగడకు పర్యావరణం ముడిపడి ఉందని అన్నారు. అనంతరం 2024-25 నూతన విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్త కాలు, విద్యా సామగ్రి విద్యార్థులకు పంపిణీ చేయడానికి ప్రధానోపాధ్యాయు లకు అందించినట్లు తెలిపారు. ఇందులో 28,695 పాఠ్య పుస్తకాలు, 6వ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటివరకు బ్యాగులు 2972, బెల్ట్ 2090 వచ్చాయని, వాటిని పాఠశాల హెచ్‌ఎం లకు అందజేసినట్లు తెలిపారు. ఇంకా విద్యార్థులకు సమరూప దుస్తులు రావాల్సి ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ షాలెట్, ఎపిఎం రజనీకుమారి, అంగన్వాడీ సూపర్వైజర్ భాను లక్ష్మీదేవి, పాఠశాల హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు విఆర్‌ఒలు, ఎంఇఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాను దినచర్యగా చేసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి



రాయచోటి: యోగాసనంలో కలెక్టర్ అభిషిక్త్‌కిషోర్

జిల్లా ప్రజలందరూ యోగాను తమ దినచర్యగా చేసుకోవాలని కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం స్థానిక రాయచోటి లోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన యోగా దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పాల్గొన్నారు. యోగ శిక్షకుడి పర్యవేక్షణలో యోగా దినోత్సవానికి హాజరైన విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ వివిధ రకాల ఆసనాలను వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవం గా గుర్తించిందని, 2015 నుంచి ప్రతి సంవత్సరము జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకుంటున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో సాయి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు:** ప్రతి ఒక్కరి జీవితంలో యోగ ఒక భాగం కావాలని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల డీన్ డాక్టర్ డాక్టర్ కె.గోపాల్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉద్యాన కళాశాల విద్యార్థులకు యోగ మాస్టర్ నన్నూరి వెంకట శివయోగపై అవగాహన కల్పించి శిక్షణను ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేటింగ్ డీన్ లీలావతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వై దీప్తి కిరణ్, డాక్టర్ నిచ్చల, వై రవిశంకర్ బాబు, ఫిజికల్ డైరెక్టర్ కళాశాల సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. **చిన్నమండెం:** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శుక్రవారం యోగా గురువు శివప్రసాద్ విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్, ప్రోగ్రాం అధికారులు కె.నాగ, నవీన్, ఎం.సుబ్బరాయుడు, పీడీ రామాంజనేయులు పాల్గొన్నారు. **నందలూరు:** మండలంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. నాగిరెడ్డి పల్లె గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద విస్‌డమ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ వలిమి రాధ ఆధ్వర్యంలో యోగా గురువు అనిల్ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ రైల్వే మెడికల్ ఆఫీసర్ బచ్చు జయ భాస్కరరావు, ఎస్సై అబ్దుల్ మహమ్మద్ జహీర్, ఎస్ఐ రామ్మోహన్, లైన్స్ క్లబ్ అధ్యక్షులు సుధాకర్ పాల్గొన్నారు. శ్రీఅన్నమాచార్య అకాడమీ పాఠశాల, నందలూరు జడ్పీహెచ్ఎస్, విభా ఏరు డైట్‌స్కూల్, టంగుటూరు జడ్‌పిహెచ్ ఎస్‌లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. **తంబళ్లపల్లి:** మండలంలోని అన్ని పాఠశా లల్లోనూ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయమూర్తి ఉమర్ ఫరూక్, కోర్టు ఉద్యోగులు, సిబ్బంది యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు త్యాగరాజు, నాగ సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **రామసముద్రం :** మండలంలోని స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సూర్య నమస్కారాలు, ప్రాణా యామం, యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎన్‌సిసి కేడెట్స్, విద్యార్థులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లె :** యోగా ఆసనాలతో శారీరకంగా, మానసికంగా దృఢత్వాన్ని సాధించవచ్చుని పద్మావతి, నారాయణ, ఎంపిడిఒ షాలెట్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల(తెలుగు)లో అంతరాతీయ యోగా దినోత్సవాన్ని ప్రధానో పాధ్యాయులు అంజాద్ అలీఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎన్‌సిసి సిటిఒ వెంకట గోపాల్, స్కౌట్ మాస్టర్లు రమణప్ప, రెడ్డి శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు. **కలకడ:** మండల కేంద్రమైన కలకడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు, ఉర్దూ, ఆదర్శ పాఠశాల, కోన జడ్‌పి హైస్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులచే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించినట్లు ప్రధానో పాధ్యాయురాలు సరస్వతి తెలిపారు. కార్యక్ర మంలో ఆయా పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **రామాపురం :** యోగాసనాలు వేయడం వల్ల మానసిక, శారీర ఆరోగ్యా నికి పరిపుష్టతకు దోహపడతాయని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ శ్యామల దేవి అన్నారు. **మదనపల్లె అర్బన్:** ప్రపంచ యోగా దినోత్సవాన్ని గురువారం స్థానిక బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ శివపార్వతి దేవి మాట్లా డుతూ నేటి యువతకు యోగా అవసరం చాలా ఉందని, ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా ఆచరించాలన్నారు. కార్యక్రమంలో మురంధర దేవి, మాలతి, ఎంవి నాయుడు, పివి రమణ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-కాశినాయన

ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠినంగా చర్యలు తప్పవని తహశీల్దార్ కృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జెసిబి, ట్రాక్టర్ యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసాపురం సమీపంలోని సగిలేరు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే ఎంతటి వారి పైనా చర్యలు తీసుకుంటామని, అక్కడ ఉన్న జెసిబిలు ట్రాక్టర్లు సీజ్ చేస్తామని అన్నారు. ఏదైనా రైతులకు, ప్రజలకు అత్యవసరమైతే తమ దగ్గర నుండి అనుమతి తీసుకోవాలన్నారు. ఇప్పటికే నరసాపురం, సాగిలేరులో ఇష్టం వచ్చినట్లు గుంతలు తీశారని పేర్కొన్నారు. అక్కడ ఎవరైనా జెసిబితో, ట్రాక్టర్‌తో ఇసుక తరలిస్తున్నట్లు తెలిస్తే వెంటనే చర్యలు తీసుకుని సీజ్ చేస్తామని హెచ్చరించారు.

వైఎస్ఆర్ విగ్రహాన్ని తొలగించొద్దు

ప్రజాశక్తి-చెన్నూరు

యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని కొందరు టిఎన్ఎస్ఎఫ్ఐ నాయకులు తొలగించమని వైస్ ఛాన్స్‌లర్‌కు వినతి పత్రం అందించడం బాధాకరమని వైసిపి జిల్లా విద్యార్థి విభాగం కార్యదర్శి గుమ్మల్ల సాయికుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఒకప్పుడు యోగి వేమన విశ్వవిద్యాలయం కడప జిల్లాకు వచ్చేందుకు వైఎస్ఆర్ కృషి చేశారన్నారు. విద్యా వ్యవస్థకు ఆయన చేసినటువంటి కృషి వల్ల యోగి వేమన విశ్వవిద్యాలయం ఏర్పడిందని తెలిపారు. అలాంటి మహానుభావునికి ఆనాడు పాలాభిషేకం చేసిన యోగి విశ్వవిద్యాలయంలో నేడు ఆయన విగ్రహాన్ని తొలగించాలని కోరడం దుర్మార్గమని ఆయన అన్నారు.

ఫిజియోథెరపీతో అంగవైకల్యం దూరం

ప్రజాశక్తి - వేంపల్లె

ఫిజియోథెరపీ చేయించుకోవడం వల్ల అంగ వైకల్యం దూరం అవుతుందని ఫిజియోథెరపిస్టులు రమేష్, వెంకట రమణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన నిజాం ఫిజియోథెరఫీ సంస్థ ఉపాధ్యాయులకు ఫిజియోథెరపీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెయిన్ కిల్లర్ మందులు వాడకుండా ఫిజియోథెరపీ చేసుకొంటే ఎక్కువ ప్రయోజనాలు ఉన్నట్లు చెప్పారు. మొబైల్ వాడడం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ కూడా వస్తాయని పేర్కొన్నారు. ఎక్కువగా తలనొప్పి, మెడ నొప్పి, పేరాలసిస్ వంటి వాటికి ఎటువంటి వ్యాయామం చేయాలనే ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. అనంతరం వినికిడి లోపం ఉన్న కావ్య అనే చిన్నారికి వినికిడి యంత్రాన్ని ఎంఇఒ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు జాఫర్ సాదిక్, స్టాలిన్ ఐజాక్, జిల్లా పరిషత్ బాలుర పాఠశాల హెచ్‌ఎం శివ మునెమ్మ, ఫిజియోథెరపీ ఆనంద్, ఐఇఆర్టీలు యశోధ, ఎంఆర్ సి సిబ్బంది సిఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు : విత్తన దుకాణదారులు రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్ర యించాలని కమలాపురం సహాయ సంచాలకులు ఎ.వి. నరసింహారెడ్డి డీలర్లకు సూచించారు. మండలంలోని విత్తన దుకాణాలను శుక్రవారం మండల వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డితో కలిసి కమలాపురం ఎడిఎ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విత్తన దుకాణాల్లో లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లలు, బిల్లు పుస్తకాలు, స్టాక్ బోర్డులు, గోడౌన్ స్టాక్ పాయింట్లను పరిశీలించామని చెప్పారు



న్యాయవాదులతో మాట్లాడుతున్న జడ్జి ఉమర్‌ఫరూఖ్

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈనెల 29న జరిగే లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జడ్జి ఉమర్‌ఫరూఖ్ కోరారు. శుక్రవారం స్థానిక కోర్టులో న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం జరిగింది. న్యాయవాదులు ప్రత్యేక చొరవ చూపి రాజీ పడే అవకాశం ఉన్న కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్నారు. ఇరు వర్గాల కక్షీదారులతో చర్చించి వారి కేసులను రాజీమార్గాన పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు.

కోడూరు సుమనశ్రీకి మలేషియా అంతర్జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - కడప అర్బన్

కడపకు చెందిన ప్రముఖ నర్తకి, రచయిత్రి డాక్టర్ కోడూరు సుమనశ్రీకి మలేషియా అంతర్జాతీయ పురస్కారం లభించింది. మలేషియా ఇండియన్ హెరిటేజ్ అండ్ కల్చర్ ఆర్గనైజేషన్ వారి ఆహ్వానం మేరకు ఈనెల 15 నుంచి 20 వరకు జరిగిన భారతీయ కళా ఉత్సవాలలో డాక్టర్ కోడూరు సుమనశ్రీ పాల్గొని కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. తర్వాత మలేషియా ప్రభుత్వ సాంస్కృతిక శాఖామంత్రి సరస్వతిచే సత్కారం, అంతర్జాతీయ పురస్కారం అందుకున్నారు. ఇండియన్ హెరిటేజ్ అండ్ కల్చర్ సంస్థకు చెందిన పవన్, శ్రీరామయ్య ఈ సందర్భంగా సుమనశ్రీని అభినందించారు.

నేడు కెఎస్ఆర్ఎం కళాశాల స్నాతకోత్సవం

ప్రజాశక్తి- కడప అర్బన్

కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ 2020 - 2024 బ్యాచ్‌లో వివిధ బ్రాంచీలలో విద్యను పూర్తి చేసిన విద్యార్థులకు 7వ స్నాతకోత్సవాన్ని ఈనెల 22న కెఎఆర్ఎం ఆడిటోరియంలో ఘనంత నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా జెఎన్‌టియు అనంతపురం విసి, ప్రొఫెసర్ జి.వి.ఆర్ శ్రీనివాసరావు హాజరు కానున్నారు. వీరి ద్వారా పట్టభద్రులైన విద్యార్థులకు పట్టాలను అందించడంతో పాటు, బ్రాంచుల వారీగా ప్రశంసా పత్రాలను అందించుచున్నారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ పి.శ్రీనివాస్ , వారి సిబ్బంది, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు హాజరుకావాలన్నారు.

బిసి భవనం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - గోపవరం

బద్వేల్ పట్టణంలో బిసి భవనంతోపాటు పూలే, అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని అవాజ్ పట్టణ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ సత్తార్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పడిగ వెంకటరమణ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం అవాజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బద్వేల్ పట్టణంలో బిసిలు 60 వేలకుపైగా జనాభా ఉన్నారని తెలిపారు. ఇంతమంది ఉన్నా పట్టణంలో ఒక బిసి భవనం లేకపోవడం విచారించదగ్గ విషయమని పేర్కొన్నారు. బిసిల ఒదరూ సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఉపయో గకరమని చెప్పారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ప్రజా సంఘాలుగా విన్నవి ంచుకున్నా పట్టించుకోకపోవడం చాలా అన్యాయమని తెలిపారు. ప్రస్తుత ప్రభు త్వమైనా బిసి భవనం స్థలం, అంబేద్కర్, పూలే స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. బిసి భవనం ఏర్పాటు చేయకపోతే బిసిలమంతా ఏకమై ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ ఉపాధ్యక్షులు ఖాజా గౌస్, నాయకులు కె వి.రసూల్, రహీం నాగూర్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన డిఆర్ఎం

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక రైల్వేస్టేషన్‌ను శుక్రవారం గుంతకల్లు డివిజన్ డిఆర్ఎం విన్నీత్‌సింగ్ పరిశీలించారు. అనంతరం 1,2 ప్లాట్‌ఫారాలు, పుట్ ఓవర్ బ్రిడ్జి, క్వార్టర్స్ పరిశీలించారు. క్వార్టర్స్‌లో ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన ఆర్‌ఒ వాటర్ ప్లాంటు తయారు చేసి అందుబాటులోకి తేవాలని సూచించారు. ముద్దనూరులో పలు రైళ్లను ఆపాలని మండల వాసులు డిఆర్ఎంకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైల్వే డివిజన్ అధికారులు సుధీర్, చంద్రశేఖర్, ముద్దనూరు సిటిఎన్ సి అధికారి చంద్ర శేఖర్, స్టేషన్ మేనేజర్ భాస్కర్, పాల్గొన్నారు.

అంధుల ఆశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణ పరిధిలోని నివేదిత పాఠశాల సమీపంలో ఉన్న అంధుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం లింగాల మండలం కర్ణ పాపాయపల్లి గ్రామానికి చెందిన వెన్నపూస జయరామక్రిష్ణారెడ్డి కుమారుడు సుజిత్ రెడ్డి 13వ జన్మదిన సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన్మదిన వేడుకలను అంధుల ఆశ్రమంలో జరుపుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని చెప్పారు. పుట్టినరోజులకు అనవసర ఖర్చులు చేయకుండా అన్నదాన కార్యక్రమం చేయడం వల్ల పది మందికి కడుపు నింపిన వాళ్లమవుతామన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ఉమాదేవి , సాయి రమ పాల్గొన్నారు.

నిరాశ్రయుల వసతి గృహంలో..

కడప : కాంగ్రెస్ పార్టీ నాయకుడు చెప్పలి పుల్లయ్య ఏకైక కుమార్తె చెప్పలి లక్ష్మీ గీతిక పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఆదరణ నిరాశ్రయుల గృహంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తన కుమార్తె పుట్టినరోజు ఇలా నిరాశ్రయుల గృహంలో చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఇలాగే చాలామంది పార్టీలకు, అనవసర కార్యక్రమాల్లో డబ్బులు వృథా చేయకుండా నిరాశ్రయులకు, అనాధలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మొదటగా కేక్ కట్ చేసి, తర్వాత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆదరణ సిబ్బంది, బంధుమిత్రులు పాల్గొన్నారు.

బోయినపల్లి ఎస్‌టి కాలనీ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- గోపవరం

బద్వేల్ మండలంలోని ఇ.బోయనపల్లి గ్రామంలో ఎస్‌టి కాలనీలో సుధీర్ఘంగా పరిష్కారం కానటువంటి స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం బద్వేల్ మండల కార్యదర్శి పి రవిచంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం ఇ.బోయినపల్లి ఎస్‌టి కాలనీలో ఏర్పాటు చేసిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో మాట్లాడుతూ గ్రామంలో సిసి రోడ్లు, మంచినీరు , మురుగు కాలువలు, వీధి కరెంటు పోల్ వీధిలైట్ల సమస్యలున్నాయని, అనేక సమస్యలు నెలకొని ఉన్నాయని దీనివల్ల ప్రజలు, అవస్థలు పడుతున్నారని వెంటనే వీటిని పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో సమస్యలను అప్పటి నాయకులు, అధికారులు గాలికి వదిలేశారని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చిన ఉపయోగం లేకపోయిందని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం లోనైనా అధికారులు స్పందించి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. అనంతరం 9 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా అనసూర్య, పి.రమాదేవి కమిటీ సభ్యులుగా వి.శ్వేత, వెంకటలక్ష్మి, రవణమ్మ వెంకటయ్య సి.రామయ్య ఎన్నుకున్నారు, సమావేశంలో సంఘం నాయకులు ఈ.రమణయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

8 మంది పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని పాపేపల్లి పంచాయతీ గొల్లవానికుంట సమీపంలో పేకాట ఆడుతున్న 8మందిని అరెస్టు చేసినట్లు ములకలచెరువు సిఐ తమ్మిశెట్టి మధు తెలిపారు. శుక్రవారం రాబడిన సమాచారం మేరకు తమ సిబ్బంది పేకాట స్థావరంపై దాడి చేశామని పేర్కొన్నారు. ఈ దాడిలో 8మందిని అదుపులోని తీసుకొని వారివద్ద నుంచి లక్షరూపాయలు నగదును స్వాధీనం కేసు నమోదు చేసినట్లు తెలలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ చలపతి, సిబ్బంది పాల్గొన్నారు.